# గబ్బు సవ్రురు

అవాళ రాష్ట్రపతి వస్తున్నారు. రోడ్డుకు అటుయిటు జనం బార్లు తీరి వున్నారు. స్వాగతం చెప్పేందుకు.

నగరం అంతా కోలాహలంగా వుంది, అలంకరణ ఆర్భాటాలతో.

జనంలో శివసాగర్ కూడా వున్నాడు.

శివసాగర్ విశ్వవిద్యాలయం విద్యార్థి. ఇలాంటి సమయాల్లో విధిగా హాజరవుతూ వుంటాడు. వచ్చేవారికోసం కాదు, వారికోసం పొయ్యేజనం మనస్తత్వం గమనించాలని, వారి హృదయాల్లో, వారి ముఖాల్లో తారట్లాడే భావాల్ని పట్టుకునేందుకు ప్రయత్నించాలని. సాధారణంగా సభలకు, సమావేశాలకు అలాంటి దృక్పథంతోనే వెళుతూ వుంటాడు. అదో పరిశోధనలా ఆత్మతృప్తి. అంత జనంలోనూ చింకిబట్టలతో ముడతలు పడ్డ చర్మంతో, చీకేసిన తాటి ముట్టెలావున్న తలతో, ఊతకర్ర సాయంతో జనాన్ని తోసుకుని ముందుకొచ్చిన ముసలమ్మ, శివసాగర్ దృష్టిని ఆకర్షించింది.

ఓ మారు రోడ్డు వంక చూశాడు శివసాగర్. పోలీస్ బందోబస్తు పకడ్బందీగా వుంది రాష్ట్రపతి కారులో ఆదారిన వెళతారు, ప్రజల స్వాగతాన్ని అందుకుంటూ. ఇంకా కొంచెం వ్యవధి వున్నట్లుంది 'ఈ లోపల ఆ ముసలవ్వను చేరుకోవాలి' అనుకుని, పోలీస్‌వారి కేకలను కూడా లెక్కచెయ్యకుండా, రోడ్డు కడ్డంగా పరుగెత్తి, అవలివైపు జనంలో ముందుకొచ్చివున్న అవ్వను చేరుకున్నాడు శివసాగర్.

అవ్వ రోడ్డువైపు ఆత్రుతగా చూస్తోంది. ఆమె చేతిలో మూతి కొంచం పగిలిపోయి, దారం కట్టిన సీసావుంది. కనురెప్పలు భారంతో పైకి లేవలేక, వున్న గుడ్డిచూపుకు కూడా అవరోధం ఏర్పడుతున్నట్లుంది. అయినా ఎడమచేతిని కనుబొమ్మలపై పెట్టి, రోడ్డుకేసి దీర్ఘంగా చూస్తూ వుంది.

శివసాగర్ తన కళ్ళజోడు ఓ మారు చేతికి తీసుకొని, చేతి గుడ్డతో తుడుచుకొని, మళ్ళా పెట్టుకున్నాడు నుదిటిమీద చెమటను అద్దుకున్నాడు. ఆజనంలో వ్యాపారం త్వరగా జరుపుకోవాలన్నట్టు ఓ కుర్రాడు, సుండల్ అంటూ అటూయిటూ పరుగులు తీస్తూ కనుపించాడు.

గడియారం వంక ఓ మారు చూసుకున్నాడు శివసాగర్. పది గంటలయింది. ఎండ తీక్షణంగా వుంది.

అవ్వకు దగ్గరగావచ్చి, నిలబడి "అవ్వా! మీదేవూరు?" అని అడిగాడు, "అమ్మోరి సత్రం. ఈడకి సరిగ్గా పదిమైళ్ళ దూరం. అడ్డ దారినొస్తే ఆరుమైళ్ళు" అన్నది అవ్వ యింకా రోడ్డు వంక చూస్తూనే.

"ఎక్కడికొచ్చావ్?" ఈమారు రోడ్డుమీద దృష్టిని ఆ యువకునికేసి మళ్ళించింది అవ్వ, ఒేరి పారా చూసింది.

"ఈడకే. అడ్డదారిన పడొచ్చా దీపం సమ్రికి. ఇయ్యాల దేశానికే పెద్దాయన వస్తాడంట, ఈ దారిన. వస్తాడా?" అడిగింది, ఆసక్తి పుట్టిపడే కంఠంతో. చెమట అప్పటికే అవ్వను సగం తడిపేసింది, "ఆఁ! వస్తారు. వారి కోసమే ఈ జనం ఇంతకూ ఆయనొస్తారని ఎవరు చెప్పారు?

చెమట తుడుచుకుంటూ, తన సొద వెళ్ళబోసుకుంది అవ్వ—

"ఇంట్లో బుడ్డెలిగించి నాల్రోజులైంది. పిల్లదేమోకని, మంచాన పడివుంది. రేత్రిల్లు పుట్టిన గుడ్డుకు వెలుతురేలేదు. దాని మొగుడేమో వట్టి తాగుబోతు.; ఏదీ పట్టించుకోడు— యదవ సచ్చినోడు. ఊపిరి బిగబట్టి యిక్కడికొస్తే, సమ్రు లేదంటున్నారు, అంగటోళ్లు. ఉండినా— నాకాడుండే పైసలకు రాదంట. ఆ పైకం సరసెయిను దిగులు పడ్డాను, పస్తుండాను, కూటికి లేనోల్లం దీపంకూడా అపసిగుడ్డు కోసరం దానికా రాత లేదు. తిరిగొస్తావుంటే ఈడ జనం వుండారు. అడిగితే చెప్పిర్ను దేశానికి పెద్దాయన వస్తుండాడని సూద్దామని నిలబడ్డా" అని చెబుతోంది దైన్యంగా.

ఇంతలో ప్రెసిడెంట్ కారుకు ముందు పైలట్ వచ్చి, సర్రున వెళ్ళి పోయింది.

జనం అంతా— అదిగో.... "ప్రెసిడెంట్ కారదుగో.... వచ్చేస్తోంది," అంటూ మరింతనిక్కి చూస్తూ, ముందుకు తోసుకోసాగారు. అప్పుడే వాళ్ళల్లో చైతన్యం వచ్చినట్టు, పోలీసులు అడ్డుపెడుతున్నారు.

ఆ త్రొక్కిసలాటతో— ముసలవ్వను వెనక్కు తోసేశారు. పడ బోయింది కానీ, శివసాగర్ పట్టుకుని ముందుకు తీసుకొచ్చి నిలబెట్టాడు.

అంతలో—

టాప్‌లేని గొప్ప కారులో రాష్ట్రపతి అన్ని లాంఛనాలతో వస్తూ కనిపించారు. కారులో నిలుచొని, అందరికీ నమస్కరిస్తున్నారు. మధ్య మధ్య చెయ్యి గాలిలోకి ఊపుతున్నారు.

కారు నెమ్మదిగా వస్తోంది, ఆదేశం మేరకు. సరిగ్గా ముసలవ్వ నిలబడివున్న చోటికిరాగానే, అవ్వ రెండు చేతులెత్తి నమస్కరించింది. ఆమెను చూడగానే రాష్ట్రపతి కారు ఆగింది.

రాష్ట్రపతి వినమ్రంగా కారు దిగి, ఆ అవ్వకు ప్రతి నమస్కారం చేస్తూ, దగ్గరికొచ్చాడు. జనం అంతా ఆదృశ్యాన్ని చిత్రంగా చూస్తున్నారు. దగ్గరికొచ్చిన రాష్ట్రపతి, "మీరు పెద్దవారు. నాకు నమస్కరించకూడదు." అన్నభావంతో అవ్వ చేతులు పట్టుకొని, 'అవ్వా! నన్ను చూడ్డానికొచ్చావా?' అని అడిగాడు అప్యాయంగా. "అవున్నాయనా! మీరు పెద్దోళ్ళు వస్తా వుంటారు, పోతావుంటారు. పేదోల్లం. మాకు గబ్బు సవురు దొరకటం లేదు. కొంచెం దయ సూపండి" అన్నది ఆవేదనగా అవ్వ. రాష్ట్రపతి వేదనగా చూశాడు ఆమెవంక. "అవ్వా! మీలాంటి వారికి అందరికీ అందాలని, చాలని అన్ని వస్తువులూ మేము దిగుమతి చేస్తూ వుంటాము. కానీ, మీకు అందటంలేదు. నిజమే! ఇకనైనా సక్రమంగా మీకు అందేలా చూస్తాము. వస్తాను అవ్వా! జాగ్రత్తగా ఇంటికెళ్ళు" అని ఆమెకు నమస్కరించి, తిరిగి తన కారెక్కి ముందుకు సాగిపోయాడు.

రాష్ట్రపతితో సంభాషించిన ఆ అవ్వ ఎంతో అదృష్టవంతురాలని అందరూ అనుకున్నారు.

* * *

గదికి తిరిగొచ్చిన శివసాగర్ మనసులో— ఇరాన్, ఇరాక్ యుద్ధం. పశ్చిమాసియా సమస్య కాశ్మీర్ వివాదం మొదలైన సమస్యలన్నిటిలో

ఆఅవ్వ గబ్బు స(వురు సమస్య ముఖ్యమైనదిగా నిలిచిపోయింది. ఆవయసులో కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా ఎండలో అంత దూరం నడిసొచ్చిన అవ్వ చివరకు కిరసనాయిల్ తీసుకోకుండానే వెళ్ళిపోయింది పసిబిడ్డతో వచ్చి బాలింత— తాగుబోతు మొగుడు. ఈ రోజు కూడా ఆ గుడిసెలో దీపం వెలగదు. పసిబిడ్డ ఆ వెలుతురును చూడాలి, ఆనందంతో ఆడు కోవాలి'—దిగ్గున లేచాడు శివసాగర్, మంచంమీద నుంచి.

టైంపీస్ వంక చూశాడు,

మధ్యాహ్నం రెండు గంటలయింది ఓ నిర్ణయానికొచ్చి బట్టలేసు కొని బయలుదేరాడు.

❋ ❋ ❋

చేతిలో చిన్న డబ్బాలో కిరసనాయిల్ తీసుకొని, అమ్మోరి సత్రం దారి పట్టాడు శివసాగర్. సాయంకాలం లోపల ఆ ఊరు చేరుకుని, గబ్బు స(వురు అవ్వకిచ్చి, ఆశ్చర్యంలో ముంచాలి. ఇవాళ ఎలాగైనా సరే ఆ ఇంట్లో వెలుగు నింపాలి— అనుకొని వడివడిగా నడవసాగాడు.

ఆ వూరికి బస్సులేదు. నడిచే వెళ్ళాలి, చిన్న అడవి— అన్నీ దుబ్బ చెట్లు బొమ్మజెముడు చెట్లు బొంతలుగా కనిపిస్తున్నాయ్. జోరుగా నడుస్తున్నాడు.

సగం దూరం వచ్చేసరికి చెరువు అడ్డం వచ్చింది దారికి. ఆపక్కనే గొడ్లు మేపుకుంటున్న కుర్రాళ్ళ నడిగాడు, అమ్మవారి సత్రం దారి. చెరువులో అడ్డంగా కాలిదారిన పొమ్మన్నారు వాళ్ళు— అతన్ని విచిత్రంగా చూస్తూ.

ఆ దారి పట్టాడు శివసాగర్!

చెరువు చాలా పెద్దది ఒక్క చుక్క నీళ్ళు లేవు. బద్దలుగా పగిలి పోయివుంది. ఎండ వేడి యింకా సెగలు కక్కుతోంది. తీతువు పిట్ట వికారంగా అరుస్తోంది. చెరువు మధ్యకు చేరుకునేసరికి— అల్లంత దూరాన ఎవరో పడిపోయివున్నారు.

దగ్గరికెళ్ళి చూస్తే— అవ్వ!

బోర్లపడిపోయింది. చేతికర్ర విరిగి వుంది. మరో చేతిలోని ఖాళీ గబ్బుసవుడు సీసా దారం వేళ్ళల్లో బిగుసుకునివుంది. కళ్ళు మాత్రం ఊరివైపు చూస్తూ వున్నాయ్.

శివసాగర్ గుండె దడదడలాడింది ఓ క్షణం. చేతిలోని డబ్బా పక్కనపెట్టి, అవ్వను వెల్లికిలా తిప్పాడు.

ఆమె ప్రాణాలు ఎప్పుడో అనంత వాయువులో లీనమై పోయాయి. బిగుసుకుపోయివుంది. శివసాగర్ మనసు చివుక్కు మంది. గుండెంతా విషాదంతో పిడచకట్టుకుపోయింది. జవసత్వాలు కూడదీసుకుని, గొడ్ల కాపర్ల వాళ్ళకై కేకేశాడు— బిగ్గరగా.

కాస్సేపటికి కేకందుకుని పరుగెత్తుకొచ్చారు వాళ్ళు.

అవ్వను చూసి, "అరె సచ్చిపోనాది ముసిల్ది చుమ్మల్ని మంచినీళ్ళు అడిగింది మద్దాణం, మాకాడలేవు, అట్టే పోయింది, నాలిక పిడచకట్టుకు పోన్నాది కావాల్న— దప్పికతో సచ్చిపోనాది" అన్నారు వాళ్ళు.

వాళ్ళ చూపుల్లో నిశ్శబ్దం, ఎండ నిలిచి కాస్తోంది:

అవ్వ అద్వాన్నపు చావుకు శివసాగర్ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

•• •• ••

ఆ రాత్రి—

అవ్వ గుడిసెలో దీపం వెలిగించాడు శివసాగర్. ఆ వెలుతురులో ముత్యంలా ఆడుకుంటోంది పసిపాప—

అవ్వ కూతురు వెక్కివెక్కి ఏడుస్తోంది. అవ్వ శవాన్ని దగ్గరుండి స్మశానానికి చేర్చాడు శివసాగర్.

చితిమీద కొంచం గబ్బుసవురు పోసి నిప్పంటించాడు

మండుకొంటున్న అవ్వ చితిముందు చేతులు కట్టుకుని, ఆలోచిస్తున్నాడు శివసాగర్.

(అంకితం : శివసాగర్‌లాంటి యువకులకు— జయంపు కృష్ణ)

*

